సాక్షి
జనగామ
గురువారం | 22 | జూన్ | 2023



తెలంగాణ అభివృద్ధికి కొట్లాడాలి

తెలంగాణ అభివృద్ధికి ప్రజలు కొట్లాడాలని టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పిలుపు నిచ్చారు. బుధవారం 'తెలంగాణ బచావో' యాత్రను ప్రారంభించారు. - 4లో▸



రక్షణకు శిక్షణేది? - 4లో▸

ప్రమాదాల నివారణకు విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించేది. ప్రస్తుతం ఎలాంటి శిక్షణ ఇవ్వకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

గరిష్టం/కనిష్టం
37^0 / 26^0

వాతావరణం

జిల్లాలో ఉదయం చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం అక్కడక్కడా మేఘావృతమైనా మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

అమరులకు నివాళులర్పించాలి



జనగామ: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని గురువారం ప్రత్యేక రాష్ట్ర సాధనలో ఆత్మబలిదానం చేసిన అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తెలిపారు. ఈ సందర్భంగా అమరులకు ఘనంగా నివాళులర్పించి రెండు నిమిషాలు మౌనం పాటించాలని పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజాపరిషత్, మున్సిపాలిటీ, ప్రభుత్వం, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు, జిల్లా సమీకృత కార్యాలయాల ప్రాంగణంలో అమరులను స్మరించుకోవాలని చెప్పారు. ఈ మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతకుమారి వీసీలో సూచనలు చేశారని తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, రోహిత్ సింగ్, అధికారులు పాల్గొన్నారు.

నెలకు పది కాన్పులు తప్పనిసరి చేయాలి



లింగాలఘణపురం: మండల కేంద్రంలోని పీహెచ్‌సీల్లో నెలకు పది కాన్పులు తప్పనిసరిగా చేయాలని డీఎంహెచ్‌ఓ ప్రశాంత్ ఆదేశించారు. బుధవారం పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన.. డాక్టర్ పనితీరు, ఆస్పత్రి నిర్వహణ, డెలివరీ గది తదితరాలను పరిశీలించారు. అనంతరం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా డాక్టర్ కరుణాకర్‌రాజు, సిబ్బంది యోగాసనాలు వేశారు.

విద్యార్థులు పొదుపు అలవాటు చేసుకోవాలి

చిల్పూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే డబ్బు పొదుపు అలవాటు చేసుకోవాలి.. ఇందుకు చిల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని ఆర్‌బీఐ ఎల్‌డీఓ బెహారా అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బుధవారం 'స్కూల్ బ్యాంక్ ఆఫ్ చిల్పూరు'ను ఆయన పరిశీలించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ హైదరాబాద్ శాఖ వారు స్కూల్ బ్యాంకుకు బీరువా, ఆఫీస్ టేబుల్ అందజేశారు. సమావేశంలో జిల్లా ఎల్‌డీఎం శ్రీధర్, డీఆర్‌డీఏ ఏపీడీ నూరొద్దీన్, స్కూల్ బ్యాంక్ చిల్పూరు ఫౌండర్ సోషల్ టీచర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం పాల్గొన్నారు.

పోలీసులను సస్పెండ్ చేయాలి

బచ్చన్నపేట: రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య విషయంలో అలసత్వం వహించిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మృతుడి కుటుంబ సభ్యులను ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, బీహెచ్‌పీఎస్ నాయకులతో కలిసి పరామర్శించి ఓదార్చారు. అనంతరం మంద కుమార్‌మాదిగతో కలిసి మాట్లాడుతూ రామకృష్ణయ్య కిడ్నాప్‌నకు గురైన రోజు ఫిర్యాదు అందగానే పోలీసులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగి ఉండేది కాదన్నారు. దళితులపై హత్యలు ఆగాలంటే ఈ కేసులోని పాత్రధారులు, సూత్రధారులందరినీ గుర్తించి శిక్షపడేలా చేయాలన్నారు. నాయకులు రాగళ్ల ఉపేందర్, పైస రాజశేఖర్, అల్వాల నర్సింగరావు, ఇనుముల నర్సయ్య, తాళ్లపల్లి కుమార్, శ్యాంసన్, రవీందర్, సుధాకర్, బొట్ల మహేష్, అనిల్, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

సర్కారు స్కూళ్ల సందర్శన



జనగామ: సోషల్ డెమోక్రటిక్ ఫోరమ్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలతో పాటు కొత్తబస్తీ ఏరియాలోని ఉర్దూ, ఇంగ్లిష్, తెలుగు మీడియం స్కూళ్లను సంఘం జిల్లా బాధ్యులు, న్యాయవాది సాధిక్ అలీ, డాక్టర్ ప్రీతి దయాళ్ సందర్శించారు. అనంతరం సాదిక్ అలీ మాట్లాడుతూ 'మన ఊరు–మనబడి' ప్రోగ్రాం కింద మార్చిలో పనులు ప్రారంభమైనా నేటికీ పూర్తి చేయలేదని, దీంతో పిల్లలు చెట్ల కింద కూర్చుని పాఠాలు వింటున్నారని తెలిపారు. కొత్త బస్తీ పాఠశాలలో తెలుగు, ఉర్దూ మీడియం ఒకే చోట ఉండడం, చుట్టూ మురికి కాలువ నుంచి వచ్చే దుర్వాసనతో పిల్లలు అనేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

వేతన వెతలు

జిల్లాలో సర్కారు స్కూళ్లు	508
ప్రాథమిక పాఠశాలలు	341
ప్రాథమికోన్నత..	64
ఉన్నత పాఠశాలలు	104
విద్యార్థుల సంఖ్య	35,905
మధ్యాహ్నభోజన కార్మికులు	1,091

ఇబ్బందుల్లో మధ్యాహ్న భోజన కార్మికులు

- నెలంతా కష్టపడితే వచ్చేది రూ.వెయ్యి
- జీఓ వచ్చినా అమలుకాని మూడు వేల గౌరవ వేతనం
- కుటుంబ పోషణకు తప్పని తిప్పలు



పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వండి వడ్డించే మధ్యాహ్న భోజన కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలు, అరకొరగా చెల్లించే బిల్లులు సైతం సమయానికి అందక.. పడరాని పాట్లు పడుతున్నారు. ఇచ్చే అరకొర గౌరవ వేతనం కూడా నాలుగు నుంచి ఐదు నెలలకు ఒకసారి అందుతుండడంతో న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని గతంలో 45 రోజుల పాటు ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. సీఎం కేసీఆర్ స్పందించి ఇప్పటి వరకు రూ.1,000 ఉన్న గౌరవ వేతనాన్ని రూ.3,000 పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన జీఓ ఈ ఏడాది ఫిబ్రవరిలో జారీ చేసినా.. ఇంత వరకు అమలుకు నోచుకోలేదు. అధికారులను అడిగితే బడ్జెట్ కేటాయించలేదంటున్నారని కార్మికులు వాపోతున్నారు.

పెరిగిన ధరలు ఇలా..

విద్యార్థులకు మెనూ ప్రకారం ప్రతి రోజు ఏదో ఒక కాయకూర, పప్పు, చారుతో తప్పనిసరిగా వండి పెట్టాలి. అయితే ప్రస్తుతం కూరగాయలు, పప్పు, చింతపండు, కారం, ఇతర సామగ్రితో పాటు వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. వారానికి మూడు సార్లు గుడ్డు అందించాలి. ప్రస్తుతం మార్కెట్‌లో గుడ్డు ధర విపరీతంగా పెరిగింది. ప్రభుత్వం చెల్లించే డబ్బులు ఏ మూలకూ సరిపోవడం లేదని భోజన కార్మికులు వాపోతున్నారు. మధ్యాహ్న భోజన పథకం కింద 1 నుంచి 5వ తరగతి పిల్లలకు ఒక్కొక్కరికి గతంలో రూ.4.97 పైసలు ఉండగా.. రూ.5.46 పైసలకు, 6,7,8 తరగతుల విద్యార్థులకు(గుడ్డు ధర మినహా) రూ.7.45 పైసల నుంచి రూ.8.17 పైసలకు, 9,10 తరగతుల వారికి గుడ్డుతో కలిపి గతంలో రూ.9.95 పైసలు చెల్లించగా.. ప్రస్తుతం రూ.10.67 పైసలకు పెంచారు. మార్కెట్‌లో పెరిగిన నిత్యావసరాల ధరలతో పోల్చితే ఇవి ఏమాత్రమూ సరిపోవని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

పెరుగుతున్న పని భారం

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో సత్యసాయి, అన్నపూర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో రాగిజావ పంపిణీ చేస్తున్నారు. జావ పిండి, బెల్లం పొడి ప్యాకెట్లు ఆయా స్కూళ్లకు అందజేస్తున్నారు. జావ కాయడానికి విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట ఇబ్బందులు తప్పడంలేదు. ఈ విద్యాసంవత్సరం నుంచి అన్ని పాఠశాలల్లో రాగి జావ అందిస్తుండడంతో తయారీకి గ్యాస్ సిలిండర్ నాలుగు నుంచి ఐదు రోజులు కూడా రావడం లేదని, ధరలతో పాటు పనిభారం పడుతోందని నిర్వాహకులు వాపోతున్నారు. చాలా సందర్భాల్లో కట్టెల పొయ్యిమీదే వంట చేయాల్సి వస్తోందని అంటున్నారు. వంట ఏజెన్సీలకు గ్యాస్ సిలిండర్, మిక్సీ, గ్రైండర్ ఉచితంగా అందించాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం మెనూ..

సోమవారం	: కిచిడీ, మిక్స్‌డ్ వెజిటబుల్, గుడ్డు
మంగళవారం	: రైస్, సాంబారు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
బుధవారం	: రైస్, ఆకుకూరలతో పప్పు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
గురువారం	: వెజిటబుల్ బిర్యానీ, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ
శుక్రవారం	: రైస్, సాంబారు, మిక్స్‌డ్ వెజిటబుల్ కర్రీ, గుడ్డు
శనివారం	: రైస్, సాంబారు





ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న నర్సింగం తదితరులు

పెరిగిన వేతనం చెల్లించాలి

మధ్యాహ్నభోజన కార్మికులకు పెరిగిన గౌరవ వేతనం చెల్లించాలని బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఏఓ మన్సూరీకి కార్మికులు వినతి పత్రం అందజేశారు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని జిల్లా అధ్యక్షురాలు ఖలీదా భేగం ఆవేదన వ్యక్తం చేశారు. వేముల నర్సింగం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వమే సరుకులు సరఫరా చేయాలి



పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నాం. ప్రభుత్వం అందించే బిల్లులు ఏమాత్రం సరిపోవడం లేదు. రేట్లు పెరగడంతో పెట్టుబడి అధికమవుతోంది. గిట్టుబాటు కావడం లేదు. సకాలంలో బిల్లులు రాక అప్పులు తెచ్చి వంట చేయాల్సి వస్తోంది. కట్టెల పొయ్యితో వంట చేయలేకపోతున్నాం. గ్యాస్ సిలిండర్‌ను ఉచితంగా అందించాలి. ప్రభుత్వమే సరుకులు సరఫరా చేయాలి.

- ఆదిలక్ష్మి మధ్యాహ్న భోజన కార్మికురాలు, జనగామ

కనీస వేతనం రూ.10,500 చెల్లించాలి



పాఠశాలల్లో 20 ఏళ్లుగా విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి పెడుతున్న భోజన కార్మికులకు ప్రభుత్వం కనీస వేతనం రూ.10,500 చెల్లించాలి. అధిక పని భారం, ధరలు పెరుగుతున్నా అప్పు చేసి వండి పెడుతున్నారు. కనీసవేతనంతోపాటు ఉద్యోగ భద్రత, బీమా సదుపాయం కల్పించాలి.

- రాపర్తి రాజు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

తెలంగాణలో ఆధ్యాత్మిక శోభ

- సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో అన్ని మతాలకు సముచిత గౌరవం
- రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సోమేశ్వరుడికి అభిషేకం చేస్తున్న మంత్రి

పాలకుర్తి టౌన్/కొడకండ్ల: తెలంగాణ సిద్ధించాక సీఎం కేసీఆర్ సారథ్యంలో అన్ని మతాలకు సముచిత గౌరవం దక్కిందని, రాష్ట్రంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుందని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆధ్యాత్మిక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. పాలకుర్తి సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పూజాకార్యక్రమాలు, హోమంలో.. కొడకండ్ల మండల కేంద్రంలోని సీఎస్ఐ చర్చి ప్రార్థనల్లో మంత్రి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు కానుకలిచ్చి పండుగలు నిర్వహించే సంస్కారం తెలంగాణలో మాత్రమే ఉందన్నారు. పురాతన ఆలయాలు అభివృద్ధి చెందాయని, ఆలయాల నిర్వహణకు నిధులు, పూజారులు, ఇమామ్, మౌజమ్, పాస్టర్లకు వేతనాలను ప్రభుత్వం పెంచిందని చెప్పారు. కవులు, కళాకారులకు తెలంగాణ వచ్చాకే తగిన గుర్తింపు, గౌరవం దక్కిందని వివరించారు. 'అంతటా దేవుడున్నాడు.. నేను గుడి, చర్చి, మసీదుకు వెళ్లి అందరినీ ఆరాధిస్తాను.. మొదటిసారి ఓటమి పాలయ్యాక జెరూసలెం వెళ్లి మూడు రోజులుండి ప్రభువును వేడుకున్న తర్వాత వరుస విజయాలు సాధిస్తున్నాను'.. అని మంత్రి పేర్కొన్నారు. వేర్వేరుగా జరిగిన ఆయా కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ రామచంద్రయ్యశర్మ, ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, ఎంపీపీలు నాగిరెడ్డి, జ్యోతి, జెడ్పీటీసీ శ్రీనివాసరావు, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, మార్కెట్ చైర్మన్ రాము, పసునూరి నవీన్, సిందె రామోజీ, అమరేందర్‌రెడ్డి, మధుసూదన్, విజయలక్ష్మి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జయశంకర్‌సార్.. మహనీయుడు



జయశంకర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి

కొడకండ్ల: స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్‌సార్ అని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి మంత్రి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణే తన ఊపిరిగా.. శ్వాస ఉన్నంత వరకు ఉద్యమించారని, ఉద్యమ నిర్మాణంలో కేసీఆర్ వెన్నంటి ఉన్న జయశంకర్ పాత్ర మరువలేనిదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అంజయ్య, ఎంపీడీఓ సురేందర్‌నాయక్, ఈజీఎస్ డైరెక్టర్ యాకయ్య, సిందె రామోజీ, జక్కుల విజయమ్మ, సర్పంచ్, ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.

బుధవారం రాత్రి జనగామ చౌరస్తాలో కురుస్తున్న వర్షం



వానలో తడుస్తూనే బైక్‌పై ప్రయాణం



జిల్లాలో మోస్తరు వర్షం

- 16 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

జనగామ: వానాకాలం సీజన్‌లో దుక్కులు దున్ని.. విత్తనాలు వేసేందుకు ఎదురు చూస్తున్న అన్నదాతలకు వరుణుడు చల్లని కబురు అందించాడు. ఈనెల 20న జల్లులు కురవగా.. బుధవారం మోస్తారు వర్షం పడింది. దీంతో రైతులు పొలం బాట పట్టనున్నారు. ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలు కాస్త ఊరట చెందారు. జిల్లాలో రాత్రి 9 గంటల వరకు సగటున 16 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సీపీఓ ఇస్మాయిల్ తెలిపారు. చిల్పూరులో 82.8, స్టేషన్‌ఘన్‌పూర్ 71.8, తరిగొప్పుల 25.3, జనగామ 17.8, పాలకుర్తి 15.8, దేవరుప్పుల 13.8, లింగాలఘణపురం 9.3, బచ్చన్నపేట 8.5, రఘునాథపల్లి 6.8, జఫర్‌గఢ్ 5, నర్మెట 3, కొడకండ్లలో 2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కాగా మరో ఒకటి, రెండు భారీ వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు నాటుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు.

యోగాతో అనేక ప్రయోజనాలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి రవీంద్ర శర్మ



యోగా సాధన చేస్తున్న జిల్లా జడ్జి తదితరులు

జనగామ రూరల్: యోగాతో అనేక ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి.రవీంద్ర శర్మ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగాతో మానసిక ప్రశాంతత లభించడంతోపాటు ఆరోగ్యంగా ఉండడానికి ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత, అదనపు సివిల్ జడ్జి సీహెచ్.నర్మద తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. వైద్య ఆరోగ్య, ఆయుష్ తదితర విభాగాలు, భజరంగ్ యోగా సంస్థాన్ తదితర సంస్థల ఆధ్వర్యంలో యోగాభ్యాసాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

మళ్లీ బీఆర్‌ఎస్ పార్టీదే అధికారం

- ఈసారి జనగామ టికెట్ నాదే..
- ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



దుర్గామాత ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

జనగామ: ముక్కోటి దేవతల ఆశీర్వాదంతో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతోందని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని బతుకమ్మ కుంట దుర్గామాత ఆలయంలో జరిగిన వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. తెలంగాణలో అన్ని మతాలకు సముచిత స్థానం కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. రానున్న రోజుల్లో తెలంగాణతోపాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీఆర్‌ఎస్ గెలుపొందడంతో పాటు కేంద్రంలో కేసీఆర్ నాయకత్వం వహిస్తారని పేర్కొన్నారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా ఈసారి జనగామ టికెట్ తనకే వస్తుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య, కమిషనర్ రజిత, కౌన్సిలర్లు జూకంటి లక్ష్మీశ్రీశైలం, బండ పద్మయాదగిరిరెడ్డి, వాంకుడోతు అనిత, పూర్ణి స్వరూప, గుర్రం భూలక్ష్మినాగరాజు, దేవరాయ నాగరాజు, రాజు, ఉడుగుల నర్సింహులు, తిప్పారపు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచరులు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు

- ప్రాణభయం ఉంది.. రక్షణ కల్పించండి
- మాజీ మావోయిస్టు సిరిమల్ల రాము




మాట్లాడుతున్న మాజీ మావోయిస్టు రాము

జనగామ: సిద్దిపేట జిల్లా జనగామ నియోజకవర్గం మద్దూరు మండలం కూటిగల్‌లో తన సొంత భూమిని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అనుచరులు దొంగ రిజిస్ట్రేషన్ చేసుకుని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మాజీ మావోయిస్టు సిరిమల్ల రాము ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో బుధవారం విలేకరుల సమావేశంలో భార్యతో కలిసి ఆయన మాట్లాడారు. తండ్రి అయిలయ్యకు బొత్తలకుంటలోని 115 సర్వే నంబర్ పరిధిలో 3 ఎకరాల 18 గుంటల భూమి ఉందని, ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అనుచరులుగా చెప్పుకునే కొందరు భూమిని దొంగతనంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. భూమికి సంబంధించి పూర్తి ఆధారాలు చట్టబద్ధంగా ఉన్నాయని, దళితున్ననే నెపంతో అష్టకష్టాలు పెడుతున్నారని వాపోయారు. న్యాయం కోసం పోరాడుతున్న క్రమంలో ఎమ్మెల్యే అనుచరులతో తనకు, కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించి తన భూమి తనకు ఇప్పించాలని కోరారు.

పడుతూ లేస్తూ.. పైపైకి!

ఒడిదొడుకుల మధ్య ఆర్థికాభివృద్ధి

- ఆర్థికవృద్ధి రేటులో హనుమకొండ టాప్–2
- రూ.6,240 కోట్లతో చివరన ములుగు జిల్లా
- తలసరి ఆదాయంలో 8వ స్థానంలో జేఎస్ భూపాలపల్లి
- అభివృద్ధి పథంలో నగరాలు, పట్టణాలు.. పదేళ్లలో గణనీయ ప్రగతి
- 'తెలంగాణ ఆర్థికాభివృద్ధి -10' నివేదికలో వెల్లడి



సాక్షి ప్రతినిధి, వరంగల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం పదేళ్లలో ఎంతో అభివృద్ధిని సాధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అనేక సవాళ్లను అధిగమించి వివిధ రంగాల్లో గణనీయ ప్రగతిని సాధించడం వెనుక జిల్లాల విభజన, జిల్లాలు సాధించిన జిల్లా స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ),తలసరి ఆదా యం (పీసీఐ)కారణంగా పేర్కొంది. రాష్ట్రం ఏర్పడక ముందు వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధుల (బీఆర్‌జీఎఫ్)కింద ఉన్న తొమ్మిది జిల్లాలో ఉమ్మడి వరంగల్ ఒకటి కాగా.. ఆతర్వాత అభివృద్ధిలో అన్ని రంగాల్లో పురోగతి సాధించింది. పదేళ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో సాధించిన ప్రగతి సూచికలో ఉమ్మడి వరంగల్ జిల్లా భాగస్వామ్యం కూడా ఉన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 'తెలంగాణ ఆర్థికాభివృద్ధి–10' నివేదికలో వెల్లడించింది.

ఆర్థిక వృద్ధి రేటులో హనుమకొండ టాప్–2

ఉమ్మడి వరంగల్‌లో ఆరు జిల్లాలు ఉండగా.. 2021–22 సంవత్సరానికిగాను ఆర్థిక వృద్ధిలో హనుమకొండ జిల్లా టాప్–2లో నిలిచినట్లు నివేదిక స్పష్టం చేసింది. తెలంగాణలో భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ ఉత్తమ పనితీరు కనబర్చాయి. ప్రస్తుత ధరల ప్రకారం.. వరుసగా 34.2 శాతం, 24.9 శాతం వృద్ధి రేటుతో ఈరెండు జిల్లాలు ఉన్నాయి. వీటితో పాటు రాష్ట్రంలోని 32 జిల్లాలు వృద్ధి రేటులో పురోగమించగా.. రూ.6,240 కోట్ల జీడీపీతో అన్నింటికన్నా చివరన ములుగు జిల్లా నిలిచింది. జిల్లాల ఆర్థికాభివృద్ధికి సూచికగా జీడీడీపీని పరిగణించగా.. అభివృద్ధి అంతా హైదరాబాద్, పరిసర ప్రాంతాల్లోనే కేంద్రీకృతం కాగా.. నగరాలు, పట్టణ ప్రాంతాల్లో కొద్దిగా మెరుగ్గా ఉన్నట్లు నివేదిక పేర్కొంది. గ్రేటర్ వరంగల్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి కారణంగా.. ఆర్థిక వృద్ధిలో టాప్–2లో నిలిచినట్లు నివేదిక చెబుతోంది.

భూపాలపల్లి భేష్

2021–22లో రంగారెడ్డి జిల్లా రూ.7,58,102ల తలసరి ఆదాయంతో రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలవగా.. రూ.2,34,818లతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎనిమిదో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లా రూ.1,94,317లతో 16వ స్థానం, రూ.1,86,278లతో జనగామ 18, రూ.1,79,222లతో మహబూబాబాద్ 20, రూ.1,77,316లతో ములుగు 21వ స్థానాల్లో నిలవగా.. హనుమకొండ రూ.1,56,086తో చివరి స్థానానికి చేరింది. బాగా పట్టణీకరణ జరిగిన జిల్లాలతో పోల్చితే.. మారుమూల గ్రామీణ జిల్లాలు తలసరి ఆదాయంలో వెనుకబడి ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హనుమకొండ జిల్లా కూడా తలసరి ఆదాయంలో వెనుకబడగా.. భూపాలపల్లి మినహా మిగతా జిల్లాలు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. ఇదిలా ఉంటే.. తలసరి ఆదాయం విషయంలో పదేళ్లలో వృద్ధిరేటు గణనీయంగానే పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి.

ఆయా జిల్లాల ప్రజల సగటు ఆదాయం పెరుగుతూ వస్తోంది. హనుమకొండ జిల్లాలో 2015–16 సంవత్సరానికి తలసరి సగటు ఆదాయం రూ.77,378లు ఉండగా.. అది కాస్తా.. 2021–22 నాటికి రూ.1,56,086కు పెరిగింది. వరంగల్ రూరల్, మహబూబాబాద్, ములుగు, జనగామ, జేఎస్ భూపాలపల్లిలోనూ తలసరి సగటు ఆదాయం పెరిగినట్లు నివేదికలో గణాంకాలు చెబుతున్నాయి.

జిల్లాల వారీగా తలసరి ఆదాయం (రూపాయల్లో)

జిల్లా	2015-16	2018-19	2019-20	2020-21	2021-22
హనుమకొండ	79,753	1,24,665	1,40,699	1,38,387	1,56,086
వరంగల్	96,076	1,34,950	1,64,667	1,75,951	1,94,317
జనగామ	88,269	1,32,176	1,77,160	1,74,636	1,86,278
జేఎస్‌భూపాలపల్లి	96,305	2,36,051	2,52,692	2,13,735	2,34,818
మహబూబాబాద్	84,464	1,37,142	1,38,594	1,52,577	1,79,222
ములుగు	--	1,43,461	1,69,239	1,67,769	1,77,316

జిల్లాల స్థూల దేశీయోత్పత్తి (జీడీడీపీ) (రూ.కోట్లలో..)

జిల్లా	2019-20	2020-21	2021-22
హనుమకొండ	17,455	17,976	20,018
వరంగల్	14,676	13,803	16,365
జనగామ	10,751	10,985	11,667
జేఎస్‌భూపాలపల్లి	10,648	12,673	11,942
మహబూబాబాద్	13,673	12.520	16,280
ములుగు	5,746	5,704	6,240

నేడు కరెంటు కోతలు

జనగామ: పట్టణంలో నూతన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ లైన్ ఏర్పాటు నిమిత్తం గురువారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ కోతలు ఉంటాయని ఎన్పీడీసీఎల్ ఏఈ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేటరోడ్డు ఎడమవైపు(పూర్తిగా), ప్రిస్టన్, దుర్గమ్మగుడి ఏరియా, శ్రీనివాస్‌నగర్ కాలనీ ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

రేపు తాగునీటి సరఫరా బంద్

పట్టణంలో బైపాస్ పైపులైన్ శుభ్రం చేయనున్న నేపథ్యంలో ఈనెల 23వ తేదీ శుక్రవారం ఈసేవా, గుండ్లగడ్డ, ధర్మకంచ జెడ్పీస్కూల్, హమాలీఅడ్డా, అంబేడ్కర్‌నగర్ వాటర్‌ట్యాంక్ ఏరియాలో నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ రజిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

జగదీశ్ కుటుంబానికి ఆర్థిక అండ

- రూ.10లక్షల ఆర్థిక సాయం ప్రకటించిన ఎమ్మెల్సీ 'పోచంపల్లి'
- రూ.32లక్షలు అందించిన అన్ని జిల్లాల జెడ్పీ చైర్మన్లు
- మల్లంపల్లి మండలానికి జగదీశ్ పేరు : మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



సంతాపం తెలుపుతున్న మంత్రులు, ఎమ్మెల్సీలు

ములుగు రూరల్: ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ దశ దిన కర్మ బుధవారం మల్లంపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్, మాజీ మంత్రి, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తోపాటు ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబానికి రూ. 10లక్షల ఆర్థిక సాయం ప్రకటించి ఉదారత చాటుకున్నారు. అలాగే, రాష్ట్రంలోని 32 జిల్లాల జెడ్పీ చైర్మన్లు తమ నెల జీతం రూ.లక్ష చొప్పున రూ. 32 లక్షలు అందించి అండగా నిలిచారు. ఎమ్మెల్సీ ఎల్.రమణ రూ. లక్ష తన వేతనం అందిస్తానని ప్రకటించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ జగదీశ్ కుటుంబ పరిస్థితులు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి అండగా ఉంటామన్నారు. అతడి చివరి కోరిక మేరకు మల్లంపల్లిని జగదీశ్ పేరుతో మండలంగా ఏర్పాటు చేస్తామన్నారు. మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కుటుంబానికి, పిల్లల చదువులకు పూర్తి బాధ్యత తీసుకుంటున్నట్లు ప్రకటించారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ వెంట ఉద్యమంలో నడిచిన నేతను కోల్పోవడం బాధాకరమన్నారు. దశదిన కర్మ కార్యక్రమాలను నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీ కవిత, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, రెడ్‌కో చైర్మన్ సతీశ్‌రెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ సోమ భరత్, మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, జెడ్పీ చైర్మన్లు బడే నాగజ్యోతి, ఆంగోత్ బిందు, సంపత్, సుధీర్, గండ్ర జ్యోతి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవింద్‌నాయక్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

రక్షణకు శిక్షణేది..?

విద్యార్థుల భద్రత గాలికేనా..?

- ఈ ఏడాది స్కూల్ బస్సు డ్రైవర్లకు శిక్షణ కరువు..
- ప్రారంభమైన విద్యాసంవత్సరం
- నిద్రావస్థలో రవాణాశాఖ
- ప్రమాదం జరిగితేగాని పట్టించుకోరా..?
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

ఖిలా వరంగల్: రహదారి భద్రతలో భాగంగా ప్రమాదాల నివారణకు రవాణాశాఖ ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ నిర్వహించేది. ఇందులో భాగంగా వాహనాల్లో ప్రథమ చికిత్స కిట్ల ఆవశ్యకత, బ్రేక్‌లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఇంజన్, గేర్ వ్యవస్థ పనితీరు, అత్యవసర ద్వారం ప్రాముఖ్యత, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చేవారు. ఫలితంగా ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డ్రైవర్లకు సంపూర్ణ అవగాహన ఉండేది. అయితే ఈ ఏడాది ఇప్పటి వరకూ శిక్షణ ఇచ్చిన దాఖలాలు లేవు. విద్యా సంస్థలు ప్రారంభమై పది రోజులు గడుస్తున్నా వరంగల్ జిల్లా ఆర్టీఏ అధికారులు తీసుకున్న చర్యలు కనిపించడం లేదు. ఇదే పరిస్థితి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉంది. ఫలితంగా విద్యార్థుల ప్రాణాలతో ముడిపడి ఉన్న అంశం కావడంతో విద్యా సంస్థల బస్సులపై రవాణాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

డ్రైవర్లకు శిక్షణ కరువు..!

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ విద్యాసంస్థల డ్రైవర్లు	
1 వరంగల్	521
2 హనుమకొండ	1098
3 జయశంకర్	326
4 ములుగు	122
5 జనగామ	163
6 మహబూబాబాద్	160
మొత్తం	2390

గతంలో డ్రైవర్లు శిక్షణకు హాజరుకాకపోతే ఆయా బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు జారీ చేయమని రవాణాశాఖ అధికారులు తేల్చి చెప్పే వారు. దీంతో విధిగా ఆయా యాజమాన్యాలు డ్రైవర్లను శిక్షణకు పంపించిన అనంతరమే విద్యా సంస్థల బస్సులను నడిపేలా చర్యలు తీసుకునేవారు. గతేడాది బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఇచ్చే సమయానికి జిల్లాలో బస్సు ఓనర్స్ అసోసియేషన్, వరంగల్ రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రైవర్లకు శిక్షణ నిర్వహించారు. అయితే ఈ ఏడాది ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలపై అవగాహన శూన్యం

గతంలో పలు అంశాలపై ఆర్టీఏ అధికారులు అవగాహన కల్పించే వారు. శిక్షణలో భాగంగా అగ్నిమాపక పరికరాలను ఏవిధంగా వినియోగించాలనే అంశంపై సంబంధిత అధికారుల సమక్షంలో శిక్షణ ఇచ్చేవారు. వివిధ వాహనాల్లో ఉపయోగిస్తున్న టెక్నాలజీ, వివిధ విడిభాగాల పనితీరు, ప్రమాదాలకు దారితీసే కారణాలు, తక్షణ నివారణ చర్యలు, తదితర అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చేవారు. అయితే ఈఏడాది ఇప్పటి వరకూ ఎలాంటి శిక్షణ ఇవ్వకుండానే ఆయా విద్యాసంస్థలు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో బస్సులు నడుపుతున్నాయి. దీనిపై రవాణాశాఖ అధికారులు స్పందించి విద్యార్థుల భద్రతకు ముప్పు వాటిల్లకముందే విద్యా సంస్థల బస్సు డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రైవేట్ స్కూల్ బస్సు దిగుతున్న విద్యార్థులు

డ్రైవర్లకు శిక్షణ ఇవ్వాలి



బస్సు కండీషన్, విద్యార్థుల భద్రతపై డ్రైవర్లకు మెరుగైన శిక్షణ ఇవ్వాలి. బస్సు ఎక్కగానే డ్రైవర్ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వేగ నియంత్రణపై వివరించాలి. కానీ ఈ ఏడాది బస్సు డ్రైవర్లకు ఆర్టీఏ అధికారులు శిక్షణ ఇవ్వలేదు.

-బండి భాస్కర్
డ్రైవర్ అసోసియేషన్ ప్రతినిధి

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



విద్యాసంస్థల బస్సుల్లో నిబంధనలు ఎంతమేరకు పాటిస్తున్నారో చూసే వారు కరువయ్యారు. డ్రైవర్ కంటిచూపు, లైసెన్స్, ఆరోగ్య విషయాలు తెలుసుకోకుండా అతడికి బస్సును అప్పగిస్తున్నారు.ఫలితంగా విద్యార్థుల బతుకులు గాలిలోదీపంలా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు నిర్లక్ష్యం వీడి స్కూల్ బస్సులు తనిఖీ చేయాలి.

-గద్దం నాగార్జున
విద్యార్థి సంఘాల ప్రతినిధి వరంగల్

డ్రైవర్లకు శిక్షణ ఇస్తాం



డ్రైవర్లకు శిక్షణ ఇవ్వకుండానే ఈ ఏడాది విద్యాసంస్థలు ప్రారంభమైన విషయం వాస్తవమే. ఓనర్స్ అసోసియేషన్, రవాణాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో డ్రైవర్లకు శిక్షణ నిర్వహిస్తాం. ఇప్పటికే స్కూల్ వారీగా శిక్షణ కార్యక్రమాలు ప్రారంభించాం.

-వెంకన్న,ఎంవీఐ

తెలంగాణ అభివృద్ధికి కొట్లాడాలి

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం



మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం

ఆత్మకూరు: తెలంగాణ అభివృద్ధికి ప్రజలు కొట్లాడాలని టీజేఎస్(తెలంగాణ జనసమితి) రాష్ట్ర అధ్యక్షుడు కోదండరాం పిలుపునిచ్చారు. జయశంకర్ స్వగ్రామం మండలంలోని అక్కంపేటలో కోదండరాం చేపట్టిన ×తెలంగాణ బచావో¤ యాత్ర బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జయశంకర్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం కోదండరాం మాట్లాడుతూ జయశంకర్ సార్ ఊరుకు ప్రత్యేక నిధులు ఇచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పి ప్రభుత్వ పెద్దలు మాట తప్పారని విమర్శించారు. గ్రామంలో ఇప్పటికీ జయశంకర్ స్మృతివనం నిర్మాణం కాలేదన్నారు.అలాగే దవాఖాన, జూనియర్ కాలేజీలు ఏర్పాటు చేయలేదన్నారు. రాష్ట్రంలో రైతులకు రుణమాఫీ చేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆర్టీసీని ప్రైవేటు పరం చేసే కుట్ర జరుగుతోందని, ఇందులో భాగంగా సంస్థను మేఘా కృష్ణారెడ్డికి అప్పచెప్పాలని ప్రయత్నాలు మొదలు పెట్టారని ఆరోపించారు. అనంతరం కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా ఏర్పాటు చేసి ప్రజల నుంచి రూ.45వేల కోట్లు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇందులో నుంచే రూ.10వేల కోట్లు వివిధ పింఛన్లకు చెల్లిస్తున్నారన్నారు. బీఆర్ఎస్ నేతలే రియల్ వ్యాపారాలు చేస్తు సామాన్యులను ఇబ్బందికి గురి చేస్తున్నారి దుయ్యబట్టారు. కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్, టీజేఎస్ నాయకులు అంబటి శ్రీనివాస్, రమేశ్, సత్యనారాయణ, జావీద్, రవీందర్, గోపిరెడ్డి, శ్రీధర్, డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిలువేరు భిక్షపతి, డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేశ్ పాల్గొన్నారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



మాట్లాడుతున్న ప్రవీణ్‌కుమార్

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేటకు చెందిన రిటైర్డ్ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితుడు, రిటైర్డ్ ఎంపీడీఓ రామకృష్ణయ్య బీఆర్ఎస్ నేతల కబ్జాలను అడ్డుకున్నారన్నారు. దీంతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి సూత్రధారిగా బీఆర్ఎస్ నాయకుడు గిరబోయిన అంజయ్యతో రామకృష్ణను హత్య చేయించారన్నారు. ఎమ్మెల్యే ముత్తిరెడ్డి చెరువులు, ఇతర భూములను కబ్జా చేస్తుంటే ఆయన అనుచరులు కూడా అదే మార్గంలో పయనిస్తున్నారని వివమర్శించారు. హత్యకు పాల్పడిన వారిలో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గంగం సతీశ్‌రెడ్డిని ఇంత వరకు ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. సీఎం కేసీఆర్ ఫామ్ హౌజ్‌కు కూతవేటు దూరంలో ఉన్న బచ్చన్నపేట మండలంలో ఏమి జరుగుతుందో చూసే తీరిక ఆయనకు లేదని మండిపడ్డారు. ఈ ప్రభుత్వంలో అక్రమాలు, అరాచకాలు చేస్తున్న నాయకులను వదిలి అమాయకులను తవ్ర ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిద్దయ్య, జిల్లా ఇన్‌చార్జ్ నిర్మాల రత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లపల్లి వెంకటస్వామి, పాలకుర్తి ఇన్‌చార్జ్ సోమారపు ఉపేందర్ పాల్గొన్నారు.

ఫార్మసీ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలి



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబీఎస్ఎఫ్ నాయకులు

కేయూ క్యాంపస్ : కేయూ పరిధిలోని బీఫార్మసీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని ఏబీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం పరీక్షల విభాగం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం పరీక్షల నియంత్రణాధికారి చాంబర్‌లో బైఠాయించి నిరసన తెలిపారు. 4 , 6 తదితర సెమిస్టర్లకు సంబంధించిన సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ మాట్లాడుతూ పరీక్షల విభాగం అధికారులు కక్షపూరితంగా బీఫార్మసీ విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా పరీక్షల నియంత్రణాధికారి మల్లారెడ్డి స్పందించి వెంటనే సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు మచ్చ పవన్ కల్యాణ్, ఉపాధ్యక్షుడు పగిడిపెల్లి పవన్, వినయ్, సాయికిరణ్, సురేశ్, వెంకటేష్, మధు, చంటి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

దైవ దర్శనానికి వెళ్లొస్తూ.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి, మార్గమధ్యలో మరొకరు..
- కట్ర్యాల శివారులో ఘటన



రోడ్డు కిందకు దూసుకెళ్లిన కారు

వర్ధన్నపేట: దైవ దర్శనం చేసుకున్న తండ్రి కొడుకులు బైక్‌పై ఇంటికి వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందగా కుమారుడికి గాయాలయ్యాయి. కారు డ్రైవర్ మార్గమధ్యలో మృతి చెందాడు. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రానికి చెందిన బుసాని యాకయ్య(56) తన చిన్న కుమారుడు విజయ్ కుమార్‌తో కలిసి బుధవారం ఐనవోలు మల్లికార్జునస్వామిని దర్శించుకుని తిరిగి బైక్‌పై తొర్రూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో కట్ర్యాల శివారు పెట్రోల్ బంక్ సమీపంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై ఎదురుగా తిరుమలగిరి నుంచి వస్తున్న కారు అదుపు తప్పి బైక్‌ను ఢీకొని అదే వేగంతో రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో యాకయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. విజయ్‌కుమార్, కారు డ్రైవర్ సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాలకు చెందిన మొగిళి పాపయ్య(58)కు తీవ్ర గాయాలయ్యాయి. వారిని వరంగల్ ఎంజీఎంకు తరలిస్తుండగా పాపయ్య మార్గమధ్యంలో మృతి చెందాడు. ఘటన స్థలాన్ని ఎస్సై ప్రవీణ్‌కుమార్ సందర్శించి దర్యాప్తు చేస్తున్నారు.

పేదలకు న్యాయం చేయాలి

- ప్రజా సంఘాల పోరాట రాష్ట్ర కన్వీనర్ వీరయ్య



చేపల వలతో వీరయ్యను సన్మానిస్తున్న మత్స్యకార్మిక సంఘం నాయకులు

హన్మకొండ చౌరస్తా: రాష్ట్ర సచివాలయం ఎదుట నిర్మిస్తున్న తెలంగాణ అమరవీరుల స్తూపం సాక్షిగా ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకున్న పేదలకు న్యాయం చేయాలని తెలంగాణ ప్రజా సంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ ఎస్ వీరయ్య డిమాండ్ చేశారు. ఈనెల 18న మహబూబ్‌బాద్‌లో ప్రారంభమైన ప్రజా సంఘాల పోరాట వేదిక బస్సుయాత్ర బుధవారం సాయంత్రం హనుమకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని నేరేళ్ల వేణుమాధవ్ కళా ప్రాంగణంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదలకు తీరని అన్యాయం చేస్తున్నాయన్నారు. సీఎం కేసీఆర్ చేసిన వాగ్దానాల్లో ప్రధానమైన డబుల్‌బెడ్ రూం ఇండ్లు ఇప్పటికీ పేదలకు అందించకపోవడం సరికాదన్నారు. కేసీఆర్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18వ తేదీన మహబూబాబాద్‌లో ప్రారంభమైన బస్సుయాత్ర ఈనెల 27వ తేదీన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలో ముగుస్తుందన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, రాములు, ఆశయ్య, పద్మ, జగదీశ్, చక్రపాణి, చుక్కయ్య, ఉప్పలయ్య, రమేశ్, సంపత్, వీరన్న, వెంకట్, విజేందర్, కొమరెల్లి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ శంకర్

ఎస్ఎస్ తాడ్వాయి : అనుమానాస్పద స్థితిలో ఒకరు మృతి చెందిన ఘటన మండల కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో జరిగింది. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఎల్లయ్యగూడెం జీపీ పరిధిలోని మాధవనగర్ కాలనీకి చెందిన కారు స్వామి (42) తాడ్వాయి ఎర్రగడ్డకు చెందిన కరపతి విజయతో సహజీవనం సాగిస్తూ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేశ్వరరావు.. స్వామి మృతదేహాన్ని పరిశీలించి ఘటనపై ఆరా తీశారు. కాగా, తాము సుమారు పదిహేను సంవత్సరాల క్రితం వివాహం చేసుకున్నామని, తమకు ఇద్దరు కుమారులు ఉన్నారని విజయ తెలిపారు. స్వామి మంగళవారం రాత్రి మద్యం సేవించి కింద పడగా తలకు గాయం కావడంతో పసుపు రాశానని తెలిపారు. బుధవారం తెల్లవారుజామున చూసేసరికి స్వామి మృతి చెందారని తెలిపింది. కాగా, స్వామి మృతిపై విజయ బంధువులు మృతుడి భార్య స్వప్నకు సమాచారం ఇవ్వగా ఆమె బంధువులతో కలిసి తాడ్వాయికి వచ్చారు. మృతదేహం పరిశీలించిన అనంతరం తనభర్త స్వామి మృతికి విజయనే కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. కాగా, పస్రా సీఐ శంకర్, క్లూస్ టీం బృందం ఈ ఘటన పై ఆధారాలు సేకరించారు. మృతుడికి భార్య స్వప్న, పిల్లలు సిరిచందన, శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

తండ్రి మందలించాడని.. యువకుడి ఆత్మహత్య



కృష్ణమూర్తి (ఫైల్)

రఘునాథపల్లి : ఏ పని చేయడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని మాధారంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన మద్దెబోయిన యాదగిరి, అంజమ్మ మూడో కుమారుడు కృష్ణమూర్తి (25)కి నాలుగు నెలల క్రితం మౌనికతో వివాహం జరిగింది. వివాహం జరిగినప్పటి నుంచి కృష్ణమూర్తి ఏ పని చేయక పోవడంతో బుధవారం తండ్రి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన కృష్ణమూర్తి పురుగుల మందు తాగాడు. తాను పురుగుల మందు తాగినట్లు స్నేహితులకు ఫోన్‌చేసి సమాచారం అందించాడు. వారు కుటుంబ సభ్యులకు తెలపడంతో వెళ్లి చూసే సరికి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. వెంటనే జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రఘుపతి తెలిపారు.

గంజాయి పట్టివేత



పట్టుబడిన గంజాయితో యువకులు

తొర్రూరు రూరల్: మండలంలోని మడిపెల్లిలో పోలీసులు బుధవారం గంజాయి పట్టుకున్నారు. ఎస్సై రాంజీనాయక్ కథనం ప్రకారం తొర్రూరుకు చెందిన పస్తం పవన్, పనికర రాహుల్ బైక్‌పై మానుకోట నుంచి తొర్రూరుకు గంజాయి తరలిస్తున్నారు. ఈ క్రమంలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా మడిపెల్లి స్టేజీ వద్ద సుమారు 3కేజీల గంజాయి పట్టుబడింది. దీంతో యువకులను అదుపులోకి తీసుకుని గంజాయితోపాటు బైక్‌పై సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కళ్లెదుటే కన్న కొడుకు మృతి

- పాకాల వాగులో పడి యువకుడి మృతి
- ప్రాణం తీసిన చెక్‌డ్యాం గుంత



మృతి చెందిన శివ(ఫైల్)

చెన్నారావుపేట : పాకాల వాగులో పడి యువకుడు మృతి చెందిన ఘటన పాపయ్యపేట శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన మంచోజు స్వరూప–రమేష్ కుమారుడు శివ (32) ఓ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. పాపయ్యపేటలో ఉంటున్న తన మేనమామ తుమ్మలపల్లి వెంకటేశ్వర్లు ఇంటికి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. మధ్యాహ్నం పాకాల వాగు సమీపంలోకి వనభోజనాలకు వెళ్లారు. భోజనం అనంతరం ఈత కోసం వాగులోకి దిగాడు. శివకు ఈత రాకపోవడంతో ఇటీవల చెక్ డ్యాం కోసం తవ్విన గుంతలో పడి మునిగిపోతుండగా.. అక్కడే ఉన్న ఆయన తండ్రి వాగులో దూకి శివను ఒడ్డుకు చేర్చాడు. కానీ, అప్పటికే శివ మృతి చెందాడు. కళ్లెదుటే కన్న కొడుకు మృతి చెందడంతో ఆ తండ్రి రోదనలు కంటతడి పెట్టించాయి.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యమే యువకుడి మృతికి కారణం..

వాగుపై చెక్ డ్యాం నిర్మించడానికి కాంట్రాక్టర్ గుంతలు తీసి పనులు చేయకుండా వదిలేశాడని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో యువకుడి ప్రాణాలు పోయాయని, యువకుడి మృతికి సదరు కాంట్రాక్టర్ బాధ్యత వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

దుస్తుల వ్యాపారం ముసుగులో చోరీలు..

- అంతర్‌రాష్ట్ర నిందితుడి అరెస్ట్
- మరో ముగ్గురిపై కేసు
- 73 గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు స్వాధీనం

హసన్‌పర్తి: దుస్తుల వ్యాపారం ముసుగులో చోరీలకు పాల్పడుతున్న అంతర్‌రాష్ట్ర నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం 73 గ్రాముల బంగారం, రూ.10 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై రాజ్‌కుమార్ కథనం ప్రకారం రాజస్థాన్‌లోని కలకువాస్ హౌజింగ్ బోర్డు అల్వార్‌కు చెందిన నరేశ్ కుమార్ శర్మ ఎనిమిదేళ్ల క్రితం వ్యాపారం నిమిత్తం మంచిర్యాల జిల్లా చెన్నూరుకు వచ్చి స్థిరపడ్డాడు. కుటుంబపోషణ భారంగా మారడంతో చోరీలు ప్రారంభించాడు. ఇలా 2020–2021లో కరీంనగర్–2టౌన్ పోలీస్‌స్టేషన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా గుండ్లవల్లేరు, విజయనగరం జిలాలలోని పార్వతీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీ చేసి జైలుకు వెళ్లాడు. జైలు నుంచి తిరిగి వచ్చిన అనంతరం మళ్లీ చెన్నూరులో దుస్తుల వ్యాపారం చేస్తూ చోరీలకు తెరలేపాడు. 2022లో హుస్నాబాద్, హన్మకొండ, చిల్పూరు మండలం పల్లగుట్ట, గోపాలపురం, కురవి ప్రాంతాల్లో చోరీలు చేశాడు. చోరీ చేసిన బంగారాన్ని కొంత భార్యకు ఇవ్వగా, మరి కొంత చెన్నూరుకు చెందిన వ్యాపారి సోమనాథ్‌కు విక్రయించాడు. కాగా, ఆయా ప్రాంతాల్లో చోరీ చేసిన బంగారాన్ని విక్రయించడానికి నరేశ్‌కుమార్ శర్మ తన బంధువులు మహేశ్‌వర్మ, కుషాల్‌వర్మతో బుధవారం కరీంనగర్ నుంచి వరంగల్ బయల్దేరాడు. ఈ క్రమంలో పోలీసులు భీమారంలో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించారు. ఇందుకు సహకరించిన మహేశ్‌శర్మ, కుషాల్‌వర్మతోపాటు బంగారు కొనుగోలు చేసిన సోమనాథ్‌ను అరెస్ట్‌చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

మహిళ ఆత్మహత్య

నర్సంపేట రూరల్ : మండలంలోని ముత్తోజిపేటలో బుధవారం రాత్రి కుటుంబ కలహాలతో ఉరివేసుకోని ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గ్రామానికి చెందిన దిడ్డి మానస (35) భర్త గణేష్‌తో ఇటీవల గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో బుధవారం మరోసారి గొడవ జరగ్గా క్షణికావేశానికి లోనైన మానస ఉరివేసుకోని ఆత్మహత్యచేసుకుంది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.